క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోవాలి

గుండాల: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రోళ్లగడ్డ, నర్సాపురం తండాలను సందర్శించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియాలో ఇతర పార్టీల గురించి తప్పుడు ప్రచారాలు చేయరాదని, చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

3న దివ్యాంగులకు హోమ్ ఓటింగ్

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ నెల 3వ తేదీన 85 సంవత్సరాల పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు సహాయ ఓటరు నమోదు అధికారి, మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి మంగళవారం తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 45మంది 85సంవత్సరాలపైబడిన వారు, 78మంది దివ్యాంగులు ఉన్నారని, వీరంతా 3న హోమ్ ఓటింగ్ ద్వారా ఎన్నికల అధికారులు, సిబ్బంది సమక్షంలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరూ 3వ తేదీన అందుబాటులో ఉండాలన్నారు.

ప్రజాసేవ చేసేందుకే పోటీ

అశ్వారావుపేటరూరల్: ప్రజాసేవ చేసేందుకే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తాండ్ర వినోద రావు అన్నారు. మంగళవారం అశ్వారావుపేట మండల కేంద్రంలోని రింగ్ రోడ్, బస్టాండ్ సెంటర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజా సేవ చేస్తానని, నేను స్థానికుడిని తనకు అన్ని సమస్యలు తెలుసని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు చంద్రశేఖర్, జె.అరవింద్, కే కృష్ణ, శ్రావణ్ కుమార్, మద్దాల దేవి పాల్గొన్నారు.

చండ్రుగొండ: గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే మీలో ఒకడిగా ఉంటానని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దక్షిణ అయోధ్యగా ఉన్న భద్రాద్రిని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనన్నారు. తాను ఎంపీగా గెలిస్తే ప్రధాని మోదీని ఈ ప్రాంతానికి తీసుకువస్తానని, తద్వారగా ఏజెన్సీ ప్రాంతం అంతా పారిశ్రామికాభివృద్ధి అవుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి విజయరామారావు, నియోజకవర్గ నాయకులు శ్రీనివాసరావు, భోగి కృష్ణ, నల్లమోతు రఘుపతిరావు, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి

దుమ్ముగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపే లక్ష్యంగా మండలంలోని పార్టీ శ్రేణులు పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ శాసన సభ్యుడు పొదెం వీరయ్య, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావులు పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మీనగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పోరిక బలరాంనాయక్‌కు మండలంలో అత్యధిక మెజారిటీ సాధించేలా దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీర మాచినేని వినీల్, భద్రాచలం నియోజకవర్గం కోఆర్డినేటర్‌లు రామకృష్ణ,నల్లపు దుర్గ ప్రసాద్ రావు, నాయకులు చింతిరాల రవికుమార్, పూజారి సూర్యచంద్రరావు, డింగి సందీప్ రెడ్డి, సిద్ధి ప్రవీణ్, కెల్లా శేఖర్, మట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించే ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన రథాలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు-ప్రమీల దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మణుగూరులో ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పాయం దంపతులకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఘనంగా సన్మానించారు. గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తెల్లం వీరభద్రం, చెంచల రాము, గొల్లపల్లి నరేష్, పర్వత నరేష్ పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు

- ప్రైవేటుకు దీటుగా ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలలు
- కొనసాగిన బాలికల హవా



విజయకేతనం సూచిస్తున్న 'లిటిల్‌ఫ్లవర్స్' విద్యార్థులు..



చంద్రుగొండ: మండల టాపర్‌గా నిలిచిన ఆఫియాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


షారోన్ సోఫియా


దేరంగుల సుభాష్


సీహెచ్.లిఖిత


అలేఖ్య


కీర్తన


ఎం. ప్రణవి


సందీప్


సంకీర్తన

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన 2023–24 సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అశ్వారావుపేట మండలంలో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి మొత్తం 641 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. వీరిలో 581 మంది ఉత్తీర్ణత సాధించారు. మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన సీహెచ్.లిఖిత 9.8 జీపీఏ, ఎండి.తమన్న, ఎస్‌కె.నసీహ అనే విద్యార్థులు 9.5జీపీఏ సాధించారు.

చర్లరూరల్: చర్ల మండలం 86 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 226 మంది పరీక్షలకు హాజరుకాగా 194 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తీర్ణత సాధించిన వారిలో కస్తూర్బా పాఠశాలకు సీహెచ్ హారిక 9.3 జీపీఏ సాధించి చర్ల మండల టాపర్‌గా నిలిచింది.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఆరు పాఠశాలలో మొత్తం 302 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 289 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో 76మంది విద్యార్థులకు 75 మంది, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 37 మందికి 36 మంది, ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో 53 మందికి 46 మంది, అన్నపురెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల 47 మందికి 44 మంది ఉత్తీర్ణత సాధించారు. టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల పాఠశాలకు చెందిన పి.అలేఖ్య, కీర్తనలు 9.5 జీపీఏ సాధించి మండలం ఫస్ట్‌గా నిలిచారు.

బూర్గంపాడు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 78.48శాతం ఉత్తీర్ణత నమోదైంది. 567 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 445 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

గుండాల: గతంలో కంటే ఈ విద్యాసంవత్సరంలో పదవతరగతి వార్షిక పరీక్షల్లో గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఉత్తీర్ణశాతం పెరిగింది. ఆళ్లపల్లిలో 99 శాతం, గుండాలలో 98 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

దమ్మపేట: దమ్మపేట మండలంలోని పాఠశాలలు 99.72 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. దమ్మపేట, నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు షారోన్ సోఫియా, డేరంగుల సుభాష్‌కుమార్‌లు 9.8 జీపీఏను సాధించి, మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

చండ్రుగొండ: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 84శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 233 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 195 మంది ఉత్తీర్ణులయ్యారు. చండ్రుగొండ జెడ్పీ పాఠశాలలో 130కి 107 మంది, పోకాలగూడెం పాఠశాలలో 24కు 22 మంది, మద్దుకూరు పాఠశాలలో 5గురికి నలుగురు విద్యార్థులు, రేపల్లెవాడ పాఠశాలలో 28కి 22 మంది విద్యార్థులు, చండ్రుగొండలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 32కి 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. చండ్రుగొండకు చెందిన లారీ డ్రైవర్ ఎంఏ జావీద్ కుమార్తె, చండ్రుగొండలోని జెడ్పీ పాఠశాల విద్యార్థి మొహమ్మద్ ఆఫియా 9.5 గ్రేడ్‌తో మండల టాపర్‌గా నిలిచింది.

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 965 మంది పరీక్షలు రాయగా 893 మంది ఉత్తీరులన్నారు.



మొత్తంగా 92.53 శాతం జీపీఏ నమోదైనట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

లిటిల్ ఫ్లవర్స్ ప్రభంజనం..

భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు బిట్ల హాసిని 10/10, రేపాక నాగ సాయి మోనిష్ 9.7/10, కోటగిరి దేవి ప్రసన్న 9.2/10, నాగ శ్రీవల్లి 9.2/10, బోడా జాహ్నవి 9.2 /10, ఏనుక సాద్విక్ 9.0/10, తిరువీజుల జశ్విని 9/10, కుందమల్ల వర్షిత వర్ధిని 9/10 జీపీఏతో పాటు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు మాగంటి రమేష్ బాబులు విద్యార్థులను అభినందించారు.

గుండాల: మండలంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థుతో పాటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం 9 కంటే ఎక్కువ జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాల నుంచి సందీప్ 9.3 సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఆళ్లపల్లి మండలంలోని కస్తూర్బా పాఠశాల నుంచి ఎం.ప్రణవి 9.5 జీపీఏ సాధించింది.

ములకలపల్లి: పదోవ తరగతి ఫలితాలలో ములకలపల్లి మండలంలో 78.86 శాతం ఉత్తీర్ణత లభించింది. మండల వ్యాప్తంగా 265 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 209 మంది పాసయ్యారు.

దుమ్ముగూడెం: మండలంలో 88.76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కొండా ప్రణదీప్ 8.7 మార్కులతో జిల్లా పరిషత్ పాఠశాలలో మండల టాపర్‌గా నిలిచాడు. ఆశ్రమ పాఠశాలల స్థాయిలో మండల టాపర్‌గా కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన తుర్రం వివేక్ 9.3 గ్రేడ్ మార్కులతో నిలచాడు. మండల వ్యాప్తంగా మొత్తం 516 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 458 మంది పాసై.. 88.76 ఉత్తీర్ణత పొందారు.

కరకగూడెం: పినపాక మండలానికి సంబంధించి 7 ప్రభుత్వ పాఠశాలలో 369 మంది విద్యార్థులకు 360 మంది పాసయ్యారు. 97.56 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మణుగూరురూరల్: మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలకు చెందిన 83మంది, రామానుజరం జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన 17మంది, సాంబాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 17మంది, మణుగూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది, గిరిజన బాలికల పాఠశాలకు చెందిన 80 మంది, ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు, ఎంజేపీటీబీసీ బాలుర పాఠశాలకు చెందిన 40మంది అత్యుత్తమ మార్కులతో ప్రతిభ కనబర్చారు.

వంద శాతం ఉత్తీర్ణత



గుండాల: వంద శాతం ఉత్తీర్ణత సాధించిన అనంతోగు బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు


గౌతమి


యశ్విత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు నమోదు అయ్యాయి. మామిళ్లవారిగూడెం గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 26 మంది ఉత్తీర్ణత పొందారు. అదే విధంగా మండలంలోని నారాయణపురం జెడ్పీఎస్ఎస్ పాఠశాల నుంచి 26 మందికి 26 మంది, అశ్వారావుపేట జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల నుంచి 22 మందికి 22 మంది, అశ్వారావుపేట జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాల(ఇంగ్లీష్ మిడియం) నుంచి 67 మందికి 67 మంది, మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి 39 మందికి 39మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని భీమునిగూడెం గ్రామంలోగల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి 48 మందికి 48మంది, అశ్వారావుపేటలోని బీసీ బాలురు గురుకుల పాఠశాల నుంచి 44 మందికి 44 మంది, బీసీ బాలికల గురుకుల పాఠశాల నుంచి 56 మందికి 56 మంది ఉత్తీర్ణులు కావడంతో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక మండలంలో ఐదు ప్రైవేటు పాఠశాలలు ఉండగా వీటిలో గుడ్ న్యూస్, సూర్య స్కూల్, శ్రీ గౌతమి పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు నమోదు అయ్యాయి.

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో బూర్గంపాడు జెడ్పీఎస్ఎస్ బాలికలు 100శాతం, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం జెడ్పీఎస్ఎస్ 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలల్లో సారపాక ఎంఎస్ఆర్ స్కూల్ 100 శాతం నమోదు చేసింది.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు జెడ్పీ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మల్లెలమడుగులో స్కూల్‌లో 44 మంది విద్యార్థులకు 44 మంది పాసయ్యారు.

చర్లరూరల్: మండలంలోని కుదునూరు, చినమిడిసిలేరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించారు. చర్లలోని రాహుల్ విజ్ఞాన్, గురుదేవ్ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

అన్నపురెడ్డిపల్లి: రాజాపురం జెడ్పీ పాఠశాలలో 10 మంది విద్యార్థులకు 10 మంది ఉత్తీర్ణులై వంద శాతం ఉత్తీర్ణత, టీటీడబ్ల్యుయూఆర్‌జేసీ బాలికల పాఠశాలలో 78 మంది పరీక్షలు రాసి 78 మంది ఉత్తీర్ణత సాధించారు.

గుండాల: స్థానిక జెడ్పీఎస్ఎస్ ఇంగ్లీష్ మీడియంలో25 మందికి 25 మంది, తెలుగు మీడియంలో 12 మందికి, 12 మంది పాసయ్యారు. మామకన్ను బాలుర ఆశ్రమంలో 13మందికి 13 మంది, శంభూనిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల నందు 16 మందికి 16 మంది పాసయ్యారు. గురుకులంలో 73 మందికి 73 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో 17 మందికి 17మంది, మర్కోడు హైస్కూల్‌లో 12 మందికి 12మంది, ఏజీహెచ్ఎస్ అనంతోగు 29 మందికి 29 మంది, కేజీబీవీలో 30 మందికి 30 పాసై వంద శాతం ఉత్తీర్ణతను వారు సాధించారు.

భద్రాచలంటౌన్: స్థానిక మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో 100 శాతం ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలలో 36 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 36 మంది ఉత్తీర్ణులైనారు.

ములకలపల్లి: మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికలలో 79 మంది విద్యార్థునులు పరీక్షలకు హాజరుకాగా అందరూ పాసయ్యారు. ఇదే పాఠశాలకు చెందిన సీహెచ్.గౌతమి, కే.యశ్విత 9.3 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ప్రిన్సిపాల్ సునిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.

కరకగూడెం: మండలం మొత్తం వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక మండలంగా కరకగూడెం నిలిచింది. ఈ మేరకు ఎంఈఓ వీరస్వామి వివరాలు వెల్లడించారు. భట్టుపల్లి కేజీబీవీ పాఠశాలలో 33మంది విద్యార్థినులకు 33, భట్టుపల్లి జెడ్పీ పాఠశాలలో 2కి ఇద్దరు, కరకగూడెం జెడ్పీ పాఠశాలలో 6గురికి 6, అనంతారం జెడ్పి పాఠశాల నుంచి 10 మందికి 10మంది, చిరుమల్ల ఆశ్రమ పాఠశాల నుంచి 37 మందికి 37మంది పాసయ్యారు. కేజీబీవీ పాఠశాల నుండి జీ.దీక్షిత 9.5 జీపీఏ సాధించగా, అదే పాఠశాల నుంచి సమీరా 9.0 జీపీఏ సాధించింది.

పదికి పది జీపీఏ కైవసం



కె.జ్యోతి చందు



10 జీపీఏ సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని భీమునిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థి కె.జ్యోతిచందు 10జీపీఏ సాధించింది. మండలంలో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలలో ఈమె ఏకైక విద్యార్థి. స్థానిక ఎంఈఓ పెండెకంట్ల కృష్ణయ్య, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం పద్మా, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు జ్యోతిచందును అభినందించారు. ప్రైవేటు పాఠశాల జవహర్ విద్యాలయానికి చెందిన కె.పల్లవి 10 జీపీఏ సాధించింది.

బూర్గంపాడు: మండలం మొత్తంలో సారపాక ప్రగతి విద్యానికేతన్‌లో చదివిన సింధూజ 10 జీపీఏ సాధించింది.

మణుగూరురూరల్: గుట్టమల్లారం శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన ఏ.రాహుల్, సీహెచ్.అనూష, యు.శృతిలు 10/10 జీపీఏ సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్ ఆయా విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలు అందించి సత్కరించారు. మణుగూరు ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల నుంచి ఏ.గీతామాధురి, జీ.తానీశ్వర్‌లు 10/10 జీపీఏ సాధించారు. చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్ వారిని అభినందించారు.

చర్లరూరల్: చర్లలోని గురుదేవ్ పాఠశాలోని 40 మంది విద్యార్థులలో గరిగిపాటి మహేశ్వరి అనే విద్యార్థిని 10 జీపీస్త సాధించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాప్తంగా మండల టాపర్‌గా నిలిచింది.

దమ్మపేట: మండలంలో ఉన్న మూడు ప్రైవేట్ పాఠశాలలు, నాలుగు ఆశ్రమ పాఠశాలలు, రెండు గురుకులాలు, ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు కలిపి మొత్తంగా 17 ప్రభుత్వ పాఠశాలల్లో 15 పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి.

చండ్రుగొండ: స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో 14కి 14 మంది విద్యార్థులు పాసై వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

భద్రాచలంటౌన్: స్థానిక త్రివేణి పాఠశాలలో ముగ్గురికి 10 జీపీఏ, ఆరుగురికి 9.8 జీపీఏ మార్కులు వచ్చాయి. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు అభినందించారు.

కరకగూడెం: పది ఫలితాలలో రాధిక స్కూల్ విద్యార్థులు 10/10 జీపీఏ మార్కులు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. 10/10 జీపీఏ ముగ్గురు విద్యార్థులు సాధించగా 9.0 జీపీఏకి పై బడి 34 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. వీదూళ్ల బయ్యారంలోని ఎక్స్‌లెంట్ భాషా హై స్కూల్ విద్యార్థులు 10/10 జీపీఏ 7గురు సాధించారు. వారిలో సాయి అక్షిత్ 9.8 జీపీఏ సాధించారు.

మణుగూరురూరల్: స్థానిక ఎక్స్‌లెంట్ పాఠశాలకు ఏడుగురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా సాయి అక్షిత్, పవిత్ర, హన్సిక, సాయిస్థా సుశాంత్, శ్రీలేఖ, స్ఫూర్తిలు 10/10 జీపీఏ పాయింట్లు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ ఎండి.యూసుఫ్ తెలిపారు.

మకర తోరణం వితరణ



మకర తోరణాన్ని అందించిన ఉప్పల చంద్రశేఖర్, ఉమావర్ధిని

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో మంగళవారం తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. అలాగే నైవేద్యాలు సమర్పించారు. బాబా ఆలయా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన ఉప్పల చంద్రశేఖర్, ఉమావర్ధిని దంపతులు ఆలయంలోగల బాబా వారి విగ్రహానికి రూ.లక్షా 10వేల రూపాయాలతో మకర తోరణం చేయించి వితరణగా అందజేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించగా, భక్తులతో ఆలయం పోటెత్తింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో తనిఖీ

గుండాల: స్థానిక పశువైద్యశాలను జిల్లా డీవీఏహెచ్ఓ అధికారి పురేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, రిజిస్టర్లను పరిశీలించారు. వేసవి కాలంలో పశువులకు వచ్చే జబ్బవాపు, దొబ్బ వాపు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వైద్యాధికారి రాజేష్, వెటర్నరీ అసిస్టెంట్ హరికిరణ్ పాల్గొన్నారు.

దూడపై వీధి కుక్కల దాడి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ఓ లేగ దూడపై మంగళవారం వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో లేగ దూడ తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు పాత మార్కెట్‌లో ఉన్న పశువుల వైద్యశాలకు తరలించి, వైద్యం చేయించారు. కాగా ప్రస్తుతానికి లేగ దూడ ఆరోగ్యం గానే ఉందని వైద్యులు తెలిపారు.

ఏఎన్ఎంకు గాయాలు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎం దంపతులు గాయాలపాలయ్యారు. స్థానిక ఎస్సై రాజమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగాపేట పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న పుష్పలత, ఆమె భర్త శ్రీనివాస్‌తో కలిసి శనివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై పాల్వంచ నుంచి ములకలపల్లి వస్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పాతూరు శివారులో ములకలపల్లి నుంచి పాల్వంచ వెళ్తున్న స్కార్పియో వాహనం ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన దంపతులను పాల్వంచ ఆస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని కోయనర్సాపురం గ్రామానికి చెందిన పరుగుల రాణి పాయం కుమారికి భద్రాచలంకు చెందిన వ్యక్తి దుల్లరి గోపి రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కుమారి ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బిలయ్‌లో 200 మీటర్ల మెయిన్ ఈవెంట్ కోసం ట్రైనింగ్ తీసుకుంటోంది. సాధన ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. వేణు, సంపత్‌లు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



అశ్వాపురం: ఫ్లాగ్ మార్చ్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి



అశ్వారావుపేటరూరల్: ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అశ్వారావుపేటలో మంగళవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్‌లో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభించగా.. బస్టాండ్ సెంటర్, శ్రీ పొట్టి శ్రీరాముల సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, భగత్‌సింగ్ సెంటర్ మీదుగా రింగ్ రోడ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ జితేందర్ రెడ్డి, స్థానిక ఎస్సైలు శ్రీరాముల శ్రీను, శివరామకృష్ణ, దమ్మపేట సాయికిశోర్ రెడ్డి, ములకలపల్లి ఎస్సై రాజమౌళి, సీఆర్పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారంలో సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అశ్వాపురం పోలీస్‌లు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ను అశ్వాపురం పోలీస్‌స్టేషన్ వద్ద డీఎస్పీ ప్రారంభించారు. పోలీసులు, సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. అశ్వాపురం, ఏడూళ్లబయ్యారం, మణుగూరు సీఐలు అశోక్‌రెడ్డి, కరుణాకర్, సతీష్‌కుమార్, ఎస్సైలు సురేష్, తిరుపతిరావు, వెంకటప్పయ్య, రాజేందర్, సీఆర్పీఎఫ్ డీఎస్పీ, సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.